# ప్రశ్న 'కోణం' పట్టించుకుంటున్నారా?

**ప్రశ్నలకు 'ఎంతో కొంత' సంబంధం ఉండేలా సమాధానాలు రాస్తే పోటీ పరీక్షల్లో పూర్తి మార్కులు రావు. ఏం అడుగుతున్నారనేది మొదట స్పష్టం చేసుకోవాలి. రాసేది నిర్దిష్టంగా, ప్రశ్న పరిధుల్లోనే ఉండేలా జాగ్రత్తపడాలి. తెలిసిన సమాచారాన్ని ప్రశ్నకు అనుగుణంగా మల్చుకోగలగాలి!**



నూతక్కి విజయశేఖర్

నేటి సివిల్స్/ గ్రూప్స్ ఉత్తీర్ణులే రేపటి బ్యూరోక్రాట్లు. నిత్యం ప్రజాపాలనకు సంబంధించిన వివిధ సమస్యలను, పరిస్థితులను, ధర్మ సంకటాలను వీరు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రజలకు, పాలనకు సంబంధించిన సందర్భాల్లో అప్పటికప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితులు కొన్ని. సహచర బ్యూరోక్రాట్లతోనో/ కింది సిబ్బందితోనో చర్చించడం ద్వారా, లేదంటే ప్రజలతోనే నేరుగా మాట్లాడడం ద్వారా నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితులు మరికొన్ని ఉంటాయి.

ఏ నిర్ణయం తీసుకున్నా అది చిన్న/ పెద్ద స్థాయి వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. అందుకే భావి బ్యూరోక్రాట్ల విశ్లేషణ శక్తినీ, తక్కువ సమయంలో సరైన నిర్ణయానికి రాగల సమయస్ఫూర్తినీ పరీక్షించే ఉద్దేశం పోటీ పరీక్షల ప్రశ్నల్లో గమనించవచ్చు.

## పరిష్కారం కనుగొనే క్రమం

అంతిమ నిర్ణయం తీసుకోబోయేముందు సమస్యలోని సానుకూల, ప్రతికూల కోణాలను విశ్లేషించాల్సి ఉంటుంది. ఆ కోణాలను విమర్శనాత్మకంగా విశ్లేషణ (క్రిటికల్లీ ఎనలైజ్) చేయవలసి ఉంటుంది. దానికంటే ముందు సమస్యను క్షుణ్ణంగా అధ్యయనం/ పరిశీలన (ఎగ్జామిన్) చేయవలసి ఉంటుంది. సరైన రీతిలో అర్థం చేసుకోవడానికి ముందు సరైన రీతిలో మూల్యాంకనం (ఇవాల్యుయేట్) చేయడం అవసరమవుతుంది. సానుకూలతలు, ప్రతికూలతలను కూడా చర్చ సందర్భంగా విమర్శనాత్మకంగా మూల్యాంకనం (క్రిటికల్లీ ఇవాల్యుయేట్) చేయగల అవకాశం వస్తుంది.



అధ్యయనం 2

ఇలా ఒక సమస్యకు పరిష్కారం కనుగొనే క్రమంలో వరుస క్రమాన్ని పాటిస్తే అంతిమంగా సమస్య పూర్వాపరాలను ఉన్నది ఉన్నట్లుగా మదింపు (అసెస్) చేయగలుగుతాం. వాస్తవ మదింపుకు రాగలిగితే అంతిమ నిర్ణయం (కన్క్లూడ్) వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉంటుంది. అది సర్వజనామోదంగా ఉండే అవకాశం ఎక్కువ.

## పేజీలు నింపితే సరిపోదు

ప్రశ్నల్లో కనపడే discuss, comment, write a critical note, critically examine లాంటి పదాలను డైరెక్టివ్స్ అంటారు.

ప్రశ్నకు సరైన సమాధానం ఇచ్చేముందు గుర్తించాల్సిన అంశాలు ప్రధానంగా: ప్రశ్నను అర్థం చేసుకోవడం, సమాధానం నిడివిని నిర్ధారించుకోవడం.

నిడివి ఎంత ఉండాలన్నది పదాల సంఖ్య ఆధారంగా నిర్ధారించుకోవచ్చు. ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ సబ్జెక్టుల్లో పాసయ్యేందుకు పేజీలు నింపడానికి అలవాటు పడివుంటాం. ఆ పద్ధతి యూపీఎస్సీ లాంటి పోటీ పరీక్షల్లో పనికి రాదు. పదాడంబరం ప్రదర్శించినా పెద్ద ఫలితం ఉండదు. సాధ్యమైనంత మామూలు పదాలతో, సూటిగా, పొదుపు మాటల్లోనే గరిష్ఠ విషయాన్ని పొందుపరిస్తేనే ఎక్కువ ఫలితం!

**ప్రశ్నలో ఉండే ప్రధానాంశాలు రెండు:** 1. విషయం 2. ఆ విషయాన్ని ప్రెజెంట్ చేయాల్సిన దిశ (డైరెక్టివ్)

ఉదాహరణకు ఈ కింది ప్రశ్నను చూద్దాం.

Critically examine the compulsions which prompted India to play a decisive role in the emeregence of Bangladesh.

ఇందులో టాపిక్: The compulsions which prompted India to play a decisive role in the emergence of Bangladesh. డైరెక్టివ్: Critically examine

బంగ్లాదేశ్ ఆవిర్భావంలో భారత్ నిర్ణయాత్మక పాత్ర పోషించింది. అందుకు కొన్ని అనివార్య కారణాలు/ ఒత్తిడులు పనిచేశాయి. ఇది ప్రశ్నలోని విషయం. ఆ కారణాలను విమర్శనాత్మకంగా పరీక్షించాలని/ పరిశీలించాలని దిశానిర్దేశం చేశారు.

(ఆ సమాధానం ఎలా ఉండొచ్చు? ... వచ్చే సంచికలో)

*రచయిత 'జాతీయ అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణ' సైట్ www.teluguvartalu.com నిర్వాహకులు.*